



స్వాతంత్ర్య వేడుకలకు కరేడు పాఠశాల ఎంపిక

ప్రజాశక్తి-కందుకూరు

ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య వేడుకలకు కరేడు పాఠశాల ఎంపికైంది. ఉలవపాడు మండలంలోని కరేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు కాటాబత్తిన కృష్ణ, విద్యార్థి కాటంగారి సాయి చరణ్ ఈ సంవత్సరం ఆగస్టు 15వ తేదీన ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో పాల్గొనుటకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పన్నూరు శ్రీనివాసులు తెలియజేశారు. రాష్ట్రం నుంచి ఐదు స్కూళ్లకు చెందిన ఉపాధ్యాయులు విద్యార్థులను మాత్రమే కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. స్వాతంత్ర్య వేడుకలకు ఎంపికైన ఉపాధ్యాయుడు, విద్యార్థిని పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.



విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

78 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులను జిల్లా ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ , నెల్లూరు మున్సిపల్ కమిషనర్ ఎం సూర్య తేజ ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్ల పై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 78 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుటకు ఎవరికి కేటాయించిన విధులను ఆయా శాఖల అధికారులు భాధ్యత తో నిర్వహించాలన్నారు. అందరు అధికారులు సమన్వయంతో కలిసికట్టుగా పని చేయాలన్నారు. పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్ లో జరిగే వేడుకలతో పాటు జిల్లాలోని అన్ని విద్యాసంస్థల్లో పండుగ వాతావరణం లో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగేలా విద్యా శాఖాధికారులు కృషి చేయాలన్నారు. అదేవిధంగా నెల్లూరులోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్ ను శోభాయమానంగా అలంకరించాల్సిందిగా సంబంధిత అధికారులకు సూచించారు. విద్యార్థినీ విద్యార్థులచే నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకునే విధంగా ఉండేట్లుగా సంగీత కళాశాల, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఏర్పాటు చేసే శకటాల ప్రదర్శన వినూత్నంగా ఉండేట్లుగాను, ఆయా శకటాలపై చేసే ప్రదర్శనలు లైవ్లీ గా, విద్యార్థినీ విద్యార్థుల్లో స్ఫూర్తి నింపే విధంగా ఉండేట్లు చూడాలన్నారు.ఈ సమావేశంలో డిఆర్‌ఓ లవన్న, అడిషనల్ ఎస్‌పి శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నెల్లూరు మున్సిపల్ కమిషనర్ ఎం సూర్య తేజ

ఇరిగేషన్ పనుల్లో దోపిడీ:సోమిరెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

వైసిపి ప్రభుత్వం హయాంలో ఇరిగేషన్ పనుల్లో అడ్డూ అదుపు లేకుండా దోపిడీ జరిగిందని సర్వేపల్లి ఎంఎల్‌ఎ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మనుబోలు మండలం అక్కంపేటలో జరిగిన ఇరిగేషన్ పనులను పరిశీలించారు. అనంతరం అక్కంపేట పెద్దచెరువు, పొట్టేళ్లకాలువ, బండేపల్లి బ్రాంచ్ కెనాల్‌ను రైతులతో కలిసి పరిశీలించారు. ఎంఎల్‌ఎ సోమిరెడ్డితో పాటు రైతులు వేసిన ప్రశ్నలకు అధికారులు నీళ్ల నమిలారు. ఒక్క రూపాయి విలువైన పనులు చేయకుండానే బిల్లులు ఎలా చేశారని అధికారులను రైతులు నిలదీశారు. ఐదేళ్ల వైసిపి పాలనలో సర్వేపల్లితో పాటు నెల్లూరు జిల్లా వ్యాప్తంగా ఇరిగేషన్ శాఖలో భారీ కుంభకోణాలు జరిగాయన్నారు. ఒక్క సర్వేపల్లి నియోజకవర్గంలోనే రూ.150 కోట్లు నుంచి రూ.200 కోట్లు దోపిడీ చేశారని తెలిపారు. ఓఅండ్‌ఎం, ఎఫ్.డి.ఆర్, ఎన్ఆర్ఇజిఎస్, రెగ్యులర్ ఫండ్‌తో పనులు చేసినట్లు నమోదు చేసి వందల కోట్లు ఎత్తేశారన్నారు. ఒకే పనిని వేర్వేరు హెడ్ల కింద చేసినట్లు చూపి కోట్లు భోంచేశారని తెలిపారు. మొన్న జనవరిలో పనులు చేసినట్లు చూపి ఫిబ్రవరిలో బిల్లులు చేసేశారన్నారు. ఆ వెంటనే పేమెంట్ల కోసం కోర్టుకెళ్లారని తెలిపారు. పనులకు సంబంధించి రెండేళ్ల మెయింటెనెన్స్ పీరియడ్‌ను నెల్లూరు ఎస్ఇ కృష్ణమోహన్ ఆర్నెళ్లకు తగ్గించి గొప్ప పని చేశారన్నారు. ఏ ఊళ్లో ఆ ఊరి రైతులు చేసుకోవాల్సిన పనులకు కూడా ప్యాకేజీలుగా మార్చి కాకాణి గోవర్ధన్ రెడ్డి లెప్ప, రైట్లకు అప్పగించారన్నారు. నెల్లూరు చరిత్రలో తొలిసారిగా నీళ్లున్నా 3 లక్షల ఎకరాల్లో మొదటి పంట పెట్టలేని పరిస్థితి తెచ్చారన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఇరిగేషన్ పనుల పేరుతో మొత్తం దోచేశారని సిఎం నారా చంద్రబాబు నాయుడు దృష్టికి ఆధారాలతో సహా తీసుకెళ్లానని తెలిపారు. విజిలెన్స్ లేక సిఐడితో విచారణ జరిపించాలని కోరానన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న దృశ్యం



ఎంఎల్ఎలకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

టిడ్కో గృహాలను లబ్ధిదారులకు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు

అల్లీపురంలోని టిడ్కో గృహ నిర్మాణాలు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వ పరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఐ నాయకులు రూరల్ శాసనసభ్యులు కాటంరెడ్డి శ్రీధర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. బుధవారం రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో సిపిఐ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా సిపిఐ నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్ మాట్లాడుతూ దాదాపు ఐదేళ్ల నుంచి అల్లీపురంలోని టిడ్కోగృహాల పనులు పూర్తికాలేదు త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఇవ్వాలన్నారు. అదేవిధంగా ఆటోనగర్లో శిథిలావస్థలో ఉన్న గురుకుల పాఠశాల అక్కచెరువుపాడు దగ్గర ఉన్న గురుకుల పాఠశాల పనులు పూర్తి చేసి వెంటనే నూతన భవనంలో మార్చాలి, ప్రజల కోసం నిర్మించిన ఏసీ బస్ షెల్టర్లను నిరుపయాగంగా పడి ఉన్నాయి అవి ప్రజలకు ఉపయోగపడేలా చేయాలన్నారు. బారాషాహీద్ దర్గాలో మసీదును నిర్మించాలి దర్గా ప్రాంతంలో అభివృద్ధి చేసి పర్యాటక స్థలంగా మార్చాలని రూరల్ శాసనసభ్యులు కాటంరెడ్డి శ్రీధర్ రెడ్డిని కోరాం ఈ కార్యక్రమంలో ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షులు అజీజ్ అహ్మద్, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నా, సిపిఐ నాయకులు షబ్బీర్, సర్తాజ్, బాదుల్లా, గౌస్, అశోక్, రియాజ్, షాజహాన్, షాకీర్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

ప్రజాశక్తి-నెల్లూరు

స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలంటూ బుజబుజ నెల్లూరు ప్రాంతంలోని 2/25 సచివాలయం ఎదుట డివైఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. బుధవారం స్థానిక డివైఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో సచివాలయ అడ్మిన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ మాజీ జిల్లా కమిటీ సభ్యులు కొండా ప్రసాద్ మాట్లాడుతూ బుజబుజ నెల్లూరులో భగత్ సింగ్ కాలనీ, వికలాంగుల కాలనీ, అనేక కాలనీలో డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి సైడు కాలువలు నిర్మాణాలు చేపట్టాలన్నారు. అంతే కాకుండా ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య నిర్మూలన కార్యక్రమాలు చేపట్టాలని, ముఖ్యంగా ఫాగింగ్ చేసి దోమల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ చుట్టుపక్కల ప్రాంతాల్లోని మురుగు గుంటల్లో ఆయిల్ బాల్స్ వేయాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నివారించేందుకు బ్లీచింగ్ చల్లించాలన్నారు. ఇటీవల కాలంలో ఈ ప్రాంతంలో దోమల కాటుకు గురై ప్రజలు విషజ్వరాల భారిన పడి వైద్యచికిత్సల నిమిత్తం వైద్యశాలలకు పరుగులు తీశారన్నారు. ఈ సమస్యను కార్పోరేషన్ కమిషనర్ సూర్యతేజ దృష్టికి తీసుకెళ్ళి ఆరోగ్యవంతమైన వాతావరణ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు యు. శ్రీనివాసులు , టి శ్రీనివాసులు, ఇంగిలాల విజయ్ కుమార్ ,ఎస్.కె ఫిరోజ్ , రాఘవ , ఎస్‌కె కరిముల్లా , పుల్లయ్య, శాఖ కార్యదర్శి కృష్ణమూర్తి , తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎంఆర్‌పిఎస్ జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి-లింగసముద్రంమందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మండల కేంద్రమైన లింగసముద్రం పంచాయతీ పరిధిలోని జంపాల వారి పాలెం లో ఎమ్మార్పీఎస్ జెండాను బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎం ఈఎఫ్ అధ్యక్షులు దేవరపల్లి బిక్షాలు మాదిగ మాట్లాడుతూ వర్గీకరణ అంశం తుది దశలో ఉన్న నేపథ్యంలో ఆగస్టు మొదటి వారంలో అన్ని గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండాలను ఆవిష్క రించాలని పిలుపునిచ్చారు. మండలంలోని అన్ని గ్రామాల్లో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలను ఏర్పాటు చేసేలా కార్యాచరణను మండల కమిటీ సిద్ధం చేయాలని చెప్పారు. నర్సింహారావు, దేవదాసు మాదిగ, జిల్లా అధ్యక్షులు ఆనంద్ మాదిగ, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షులు ఐజాక్ మాదిగ, రాము మాదిగ,కత్తి మనోహర్, ప్రసాద్ మాదిగ, కత్తి మధు మాదిగ పాల్గొన్నారు.



మట్టిని తోలిన దృశ్యం

ఎంఎల్ఎ 'ఇంటూరి'కి కృతజ్ఞతలు


ప్రజాశక్తి - లింగసముద్రం

మండలంలోని యర్రారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని ఉట్లవారిపాలెం ప్రాథమిక పాఠశాలలో నాడు-నేడు పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో విద్యార్థులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ప్రహరీ నిర్మాణం పూర్తి కాకపోవడం పాఠశాల ఆవరణం గుంతల మయంగా మారడంతో వర్షం వచ్చినప్పుడు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.ఈ విషయం గురించి కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన ఆయన తక్షణమే పాఠశాల ఆవరణలో మట్టితోయించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సూచించారు. దీంతో యర్రారెడ్డిపాలెం గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఉట్లపల్లి పెద్ద మాధవరావు టిడిపి నాయకులు రాజారపు మాలకొండయ్య అధికారులతో చర్చించి పాఠశాల ఆవరణలో మట్టి తోలించారు.అదేవిధంగా గ్రామంలో నుండి తోటల్లోకి వెళ్లే రోడ్డు అస్తవ్యస్తంగా ఉండడంతో ఆ రోడ్డుకి కూడా మట్టి తోలించి రాకపోకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం జరిగింది.ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు తెలుగుదేశం పార్టీ నాయకులు శాసనసభ్యులు నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. శాసనసభ్యులు సహకారంతో గ్రామంలో ఉన్న సమస్యలన్నిటిని ఒక్కొక్కటిగా పరిష్కరించడం జరుగుతుందని తెలుగుదేశం పార్టీ నాయకులు తెలిపారు.

పెన్షన్ల పంపిణీకి సర్వం సిద్ధం

ప్రజాశక్తి లింగసముద్రం

మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో 5353 పెన్షన్ల పంపిణీకి రెండు కోట్ల 21 లక్షల 53వేల రూపాయలు సిద్ధం చేసినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కట్టా శ్రీనివాసులు బుధవారం చెప్పారు. గ్రామాల వారీగా పంపిణీ చేసేందుకు సచివాలయ సిబ్బంది,పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు నియమించడం జరిగిందని తెలిపారు. వృద్ధాప్యం పెన్షన్లు 3218, వితంతు పెన్షన్లు 1135, వికలాంగుల పెన్షన్లు 496, ఒంటరి మహిళా పెన్షన్లు 153, అభయహస్తం పెన్షన్లు 153, ఫిషరీస్ పెన్షన్లు 16, డయాలసిస్ పెన్షన్లు 34, వీటితోపాటు మరికొన్ని పెన్షన్లు అందజేయడం జరుగుతుందని వివరించారు. గురువారం ఉదయం 6 గంటల నుంచి గ్రామాల్లో పెన్షన్ పంపిణీ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. తొలిరోజే ఎక్కువ మందికి పెన్షన్లు పంపిణీ చేసేలా పర్యవేక్షణ చేయడం జరుగుతుందని,సిబ్బందితో సమన్వయం చేసుకొని ఎక్కువమంది పెన్షన్ దారులకు పెన్షన్ పంపిణీ చేసేలా చూస్తామన్నారు





పొలాల్లో పరిశీలిస్తున్న అధికారి

ఎలుకలతో పంట నష్టం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

పొలాల్లో ఎలుకలు వలన కొంత పంట నష్టం వాటిల్లుతుందని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎ.రాజ్ కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని నరుకురు గ్రామంలో మండల వ్యవసాయ అధికారిణి వి.వి శిరీష రాణితో కలసి ఆయన పొలాలు పరిశీలించారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ ఎలుకల వల్ల జరుగుతున్న పంట నష్టంపై రైతులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎలుకల నివారణకు బ్రోమోడైలిన్, జింక్ ఫాస్ఫైడ్, వాడాలని ఏడిఎ సూచించారు. అంతేకాకుండా కొంతమేర పంటను కొంతమేరకు సుడిదోమ ఆశిస్తున్నట్లు గుర్తించడం జరిగిందని చెప్పారు. సుడిదోమ నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి వాడాలని సూచించారు. నత్రజని ఎరువుల వాడకం తగ్గించాలని తెలిపారు. పొలంలో నీరు నిలువ లేకుండా చూసుకోవాలని సూచించారు. తూర్పు పడమరలుగా దారులు తీయాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు నిరీష, కుసుమ, విద్యాసాగర్, కావేరి, శశి, అనూష, డయాన, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమసమాజ స్థాపనలో భాగం కావాలి

ప్రజాశక్తి-నెల్లూరు

విద్యార్థులు శాస్త్ర విద్యా సాధనకు, సమ సమాజ స్థాపనలో భాగస్వామ్యం కావాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు)రాష్ట్ర అధ్యక్షులు ఎల్.రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి ఎం. వినోద్ కుమార్‌లు పిలుపునిచ్చారు. బుధవారం నగరంలో పిడిఎస్‌యు జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు ఎం. సునీల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్, వినోద్ కుమార్ లు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను సంస్కరిస్తున్నామంటూనే, విద్యారంగాన్ని నాశనం చేస్తున్నారన్నారు.మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానం ద్వారా ప్రాథమిక విద్య ధ్వంసం అవుతుందన్నారు. రాష్ట్రాల ఫెడరల్ హక్కులు దెబ్బతింటున్నాయన్నారు. కేంద్ర బడ్జెట్ లో విద్య రంగానికి లక్షా 48 వేల కోట్ల రూపాయలు కేటాయించడం దారుణమన్నారు.ఈ ఏడాది నిర్వహించిన నీట్ పరీక్షలో పలు అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయని, ఈ నేపథ్యంలో ఆ పరీక్షను రద్దుచేసి తిరిగిమరలా నిర్వహించాలన్నారు. నీట్ రాసి నష్టపోయిన 20 లక్షల మంది విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. తల్లికి వందనం కార్యక్రమం ప్రారంభించాలని, ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి అవసరమైన చర్యలు తీసుకోవాలని తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదం తెలిపారు.



మాట్లాడుతున్న పిడిఎస్‌యు నాయకులు

17 మందితో నూతన జిల్లా కార్యవర్గం

ఈసమావేశంలో చివరగా 17 మంది నూతన జిల్లా కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షులుగా ఎం సునీల్, ప్రధాన కార్యదర్శిగా ఎస్కే షారుక్, శ్రావణ్, ప్రసాద్.ఉపాధ్యక్షులుగా, చరణ్, ఆసీర్ లు సహాయ కార్యదర్శులుగా, వసీం జిల్లా కోశాధికారిగా, సభ్యులు నవీన్, సంతోష్, వెంకటేశ్వర్లు, మస్తాన్ , నవీన్, సాయి దేశ్, చరణ్, నరేంద్ర, తేజ కో ఆప్షన్ తోటి 17 మంది తో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

ఎఇలు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-నెల్లూరు

విద్యుత్ శాఖ రూరల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఏ.సోమశేఖర్‌రెడ్డి ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించిన సందర్భాన్ని పురస్కరించుకొని పలువురు రూరల్ డివిజన్ పరిధిలోని విద్యుత్ శాఖ ఉద్యోగులు, సిబ్బంది పూలబొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2021 జూన్ 16వ తేదీ నుంచి ఈ ఏడాది జూలై 30వ తేదీ వరకు నగర డివిజన్ పరిధిలో ఏఈగా బాధ్యతలు నిర్వహించామన్నారు. శాఖ పరమైన బదిలీల్లో భాగంగా తనను రూరల్ డివిజన్‌లో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించాలని విద్యుత్తు శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వారి ఆదేశాలకు అనుగుణంగా మెరుగైన విద్యుత్ ను వినియోగదారులకు అందించేందుకు కష్టపడి పనిచేస్తానని తెలిపారు.జిల్లాలోని అధికారులు,సిబ్బంది ,యూనియన్ నాయకులు,అసోసియేషన్ నాయకులు అందరినీ కలుపుకో రూరల్ డివిజన్‌లో విద్యుత్ సమస్యల పరిష్కారం, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



నగర ఏఈగా శ్రీధర్ బాధ్యతలు స్వీకరణ

టౌన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గా ఎం.శ్రీధర్ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. బుధవారం విద్యుత్తు భవన్‌లోని ఆయన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకె.నగర్ ప్రాంతంలోని ఆపరేషన్ సబ్ డివిజన్ కార్యాలయంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న తనకు శాఖ పరమైన ప్రమోషన్స్‌లో భాగంగా ఏఈగా అధికారులు నియమించారన్నారు. ఇప్పటి వరకు ఏ.కె.నగర్ సబ్ డివిజన్ , రాజేంద్ర నగర్ సబ్ డివిజన్ లలో ఏ.ఈ. గా , ఏ.డి.ఈ. గా పనిచేసిన అనుభవంతో అందరి ఉద్యోగస్తులను కలుపుకుని డివిజన్ ను అన్ని విధాలా ముందుకు తీసుకెళ్తానని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుగుణంగా ప నిచేస్తానని తెలియజేశారు.జిల్లాలోని అధికారులు,సిబ్బంది ,యూనియన్ నాయకులు,అసోసియేషన్ నాయకులు అధికారికి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.



పారదర్శకంగా నిర్మాణాలు పర్యవేక్షించాలి..

ప్రజాశక్తి నెల్లూరు సిటీ

నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలోని నూతన భవన నిర్మాణాలు ప్రణాళికాబద్ధంగా జరిగేలా సచివాలయ వార్డు ప్లానింగ్ కార్యదర్శులు పర్యవేక్షించి పారదర్శకంగా పనిచేయాలని కమిషనర్ సూర్య తేజ పేర్కొన్నారు. నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు, సచివాలయ వార్డు ప్లానింగ్ కార్యదర్శులతో కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన భవన నిర్మాణ అనుమతుల కోసం యజమానులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న అనంతరం సచివాలయ పరిధిలోని కార్యదర్శులు క్షేత్ర స్థాయిలో స్థలాన్ని పరిశీలించి వివరాలను నమోదు చేయాలని సూచించారు. నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ కార్పొరేషన్ నిబంధనల మేరకు నిర్మాణం జరిగేలా పర్యవేక్షించాలన్నారు. ప్లాన్ మంజూరుకు అవసరమైన మేరకు ధ్రువీకరణ పత్రాలు సమర్పించకపోయినా, ఇతర ప్రమాణాలను పాటించకపోయినా భవన యజమానికి వివరణ అందించి పూర్తి వివరాలతో తిరిగి దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు.కార్యక్రమంలో సిటీ ప్లానర్ దేవి కుమారి టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ దశయ్య, టౌన్ ప్లానింగ్ సూపరింటెండెంట్ పద్మ, సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్


కోడూరు చెరువు తవ్వేస్తున్నారు..!

-పంచాయతీ ఆదాయానికి గండి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

మట్టి దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. చెరువులు, ప్రభుత్వ భూము లలో ఎలాంటి అనుమతుల్లేకుండా అక్రమార్కులు భారీ యంత్రాల తో మట్టి తవ్వేస్తున్నారు. అక్రమార్కులు వాల్టా చట్టానికి తూట్లు పొ డుస్తున్నా అధికారులు వారిపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. మట్టి అక్రమ దందాలపై నీటిపారుదల, రెవెన్యూ శాఖ అధికారులు అనుసరిస్తున్న తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ విచిత్రం ఏమిటంటే అధికార టీడీపీ ముసుగులో కొందరు వైసీపీ నాయ కులు ఈ మట్టి అక్రమ దందాను సాగిస్తుండడం. వివరాల్లోకి వెళితే..

తోటపల్లిగూడూరు మండలం కోడూరు-ఈదూరు జాయింట్ చెరువు నుంచి పది రోజుల నుంచి కొందరు యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నా రు. చెరువుల్లో మట్టిని నూతన లేఅవుట్లు, ఇటుక బట్టీలు, ఇళ్ల నిర్మాణా లు, తదితరాలకు దర్జాగా అమ్మేస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ మట్టికి రూ. వె య్యి నుంచి 15 వందల వరకు వ సూలు చేస్తున్నారు. ప్రత్యేకించి రాత్రి వేళల్లో మట్టి తవ్వకాలు, రవాణా సాగుతుండడం గమనార్హం. రోజుకు 75-100 ట్రిప్పులు మట్టిని కోడూరు చెరువు నుంచి తరలిస్తున్నట్లు స మాచారం. ఈ మేరకు లెక్కలు రోజుకు రూ. 75 వేల నుంచి లక్ష రూపాయల వరకు కోడూరు పంచాయతీ ఆదాయానికి గండి పడుతోం ది. దర్జాగా ఇంత పెద్ద ఎత్తున అక్రమ మట్టి దందాసాగుతున్నప్పటికీ ?చ ర్య లు తీసుకోవాల్సిన నీటి పారుదల, రెవెన్యూ శాఖల అధికారులు మిన్నకుంటున్నారు. మట్టి తవ్వకాలు చేప డుతున్న అక్రమార్కులకు రాజకీయ అండదండలు ఉండటమే కారణమ నే విమర్శలొస్తున్నాయి. అధికార టీడీపీకి చెందిన కొందరు ప్రజాప్రతిని ధులు తెర వెనుక కీలక పాత్ర పోషి స్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం కో డూరు చెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారు గత వైసీపీ ప్రభుత్వంలో చెరువు నుంచి అక్రమ మట్టి తరలింపుపై గగ్గోలు పెట్టిన వారే కావడం గమనార్హం. సార్వత్రిక ఎన్నికలకు పది రోజులు ముందు టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు ఈ మట్టి దందాలకు పాల్పడుతున్నారని తెలిసింది. విచ్చలవిడిగా లోడుతో మట్టిని తరలిస్తుండటంతో రహదా రులు శిథిలమవుతున్నాయి. ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నా రు. దీనికి తోడు చెరువుల్లో ఏర్పడిన భారీ గుంతల్లోకి వర్షపు నీరు చేరు తోంది. ఈ నేపథ్యంలో ప్రజలు ప్రమా దాల బారిన పడే అవకాశం కూడా లేకపోలేదు. దాంతో సంబంధిత శాఖల ఉన్నతాధికారులు జోక్యం చేసు కొని అక్రమ మట్టి తరలింపులకు అడ్డుకట్ట వేసి, అక్రమార్కులపై చర్య లు తీసుకోవాలని కోడూరు పంచాయతీ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



మట్టిని తవ్వుతున్న దృశ్యం

మట్టి అక్రమాలపై చర్యలు : ఇరిగేషన్ ఎఇ విజయ భాస్కర్ రెడ్డి

కోడూరు చెరువు నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేడు ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లాలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి అధికారులు సర్వం సిద్ధం చేశారు. గురువారం ఆగస్టు 1వ తేదీ ఉదయం 6 గంటలకే లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లను అందించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. పింఛన్ల పంపిణీని కేవలం రెండురోజుల్లోనే నూరుశాతం అందించేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసిన సంగతి అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం ఈ నెల చివర రోజు కావడంతో ఫింఛన్ పంపిణీకి అవరమైన నగదును జిల్లా అధికారులు బ్యాంకుల నుంచి డ్రా చేసి సచివాలయాల వారీగా ఇప్పటికే పంపిణీ చేసినట్లు జిల్లా అధికారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ అధికారులే నేరుగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లను అందిస్తారు. ఆగస్టు 1, 2వ తేదీల్లోగా ఎట్టిపరిస్థితిల్లో నూటికి నూరుశాతం పింఛన్లను అందించాలని అధికారులకు కలెక్టర్ ఆనంద్ స్పష్టమైన ఆదేశాలిచ్చారు. జిల్లాలో ఆగస్టు 1వ తేదీన 3,13,784 మంది పలురకాల పింఛన్ లబ్ధిదారులకు చెల్లించేందుకు రూ.132.58 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. పింఛన్ల పంపిణీకి జిల్లావ్యాప్తంగా 6994మంది సిబ్బందిని క్లస్టర్ల వారీగా మ్యాపింగ్ చేశారు.

48వ డివిజన్‌లో మంత్రి నారాయణ చేతుల మీదుగా పింఛన్ల పంపిణీ

నగరంలోని 48వ డివిజన్ పొర్లుకట్ట ప్రాంతంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. ఇదిలా ఉంటే ఇందుకూరుపేట మండలం కుడితిపాలెం గ్రామానికి చెందిన పులి సుమన్‌కు రూ.15వేల వికలాంగుల పింఛన్‌ను అధికారులు అందించనున్నారు. ఇటీవల మంచానికే పరిమితమైన పులి సుమన్‌కు రూ.15వేలు పింఛన్ అందించాలని ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీని అందజేయగా, అతనికి రూ.15వేలు పింఛన్‌ను కలెక్టరు ఆనంద్ మంజూరు చేశారు. ఈ మేరకు గురువారం అధికారులు సుమన్ ఇంటికి వెళ్లి నూతనంగా మంజూరైన రూ.15వేల పింఛన్‌ను అందజేయనున్నారు.

ప్రసాదరావు సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-కందుకూరు ఉప విద్యాశాఖాధికారిగా ఎంవివి ప్రసాదరావు సేవలు ప్రశంసనీయమని పలువురు ఎంఇఒలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కొనియాడారు. పట్టణంలోని శ్రీ జనార్ధన స్వామి కళ్యాణ మండపంలో డిప్యూటీ డిఇఒ ప్రసాదరావు ఉద్యోగ విరమణ సన్మాన సభ బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఉపాధ్యాయ విధుల్లో చేరిన నాటి నుండి అహర్నిశలు అంకిత భావంతో పని చేశారని, ఉద్యోగ విరమణ అనంతరం ఆయన శేష జీవితాన్ని తన కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. గత 33ఏళ్లుగా విధి నిర్వహణలో ఏలాంటి మచ్చ లేకుండా సెకండరీ గ్రేడ్ టీచర్ నుంచి ఉప విద్యాశాఖాధికారి స్థాయి వరకు అంచెలంచెలుగా ఎదిగి అందరి మన్ననలు పొందారని కొనియాడారు. ఎంతో పని ఒత్తిడితో విధులు నిర్వర్తి ంచిన ఎలాంటి రిమార్క్ లేకుండా పదవి విరమణ చేయడం గొప్ప విషయమని కొనియాడారు. ఆయనకు కేటాయించిన విధుల పట్ల నిబద్ధతో పనిచేశారని, తోటి సిబ్బందితో స్నేహభావంగా ఉంటూ క్రమ శిక్షణతో విధులు నిర్వహించారన్నారు. ప్రధానోపాధ్యాయులు సంఘం నాయకులు మాధవరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఇఒ సుబ్బారెడ్డితో పాటుగా 5 మండలాల ఎంఇఒలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిఆర్ఎంటిలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పసాదరావుని సత్కరిస్తున్న దృశ్యం

2 నుంచి మంత్రి 'ఆనం' పర్యటన



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి, ఆత్మకూరు నియోజకవర్గ ఎంఎల్ఎ ఆనం రామనారాయణరెడ్డి 2వ తేదీ నుంచి ఆత్మకూరు నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు ఆయన క్యాంపు కార్యాలయ సిబ్బంది బుధవారం ప్రకటనలో తెలిపారు. 2న ఉదయం 10 గంటలకు ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో మంచినీటి సరఫరా విభాగం ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తారని, అనంతరం తాగునీటి సరఫరాలో సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యక్షంగా పరిశీలిస్తారన్నారు. మధ్యాహ్నం 12గంటలకు ఆర్డీఓ కార్యాలయంలో తహశీల్దార్ కార్యాలయ నూతన భవనం, ఆర్అండ్బీ విశ్రాంతి అతిథి భవన పనుల పురోగతి, ఆత్మకూరు నూతన బిసి బాలికల రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహిస్తారన్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు చేజర్ల మండలం పెరుమాళ్లపాడులోని ఆనం గార్డెన్స్‌లో చేజర్ల మండల నాయకులతో సమీక్ష నిర్వహిస్తారన్నారు. 3వ తేదీ ఉదయం 10 గంటలకు ఆనం గార్డెన్స్‌లో సంగం మండల టిడిపి నాయకులు, మధ్యాహ్నం 3.30 గంటలకు ఎఎస్‌పేట మండల నాయకులతో సమీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. 4వ తేదీ ఉదయం 10 గంటలకు నెల్లూరు ఎసి సెంటర్‌లోని పార్టీ కార్యాలయంలో ప్రజా వినతులను స్వీకరిస్తారని, సాయంత్రం 4గంటల నెల్లూరు నుండి విజయవాడకు బయల్దేరి వెళ్తారని తెలిపారు.

పేదలకు అందని ఎన్‌డిఎ బడ్జెట్

ప్రజాశక్తి-కావలి

ఇటీవల కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆంధ్ర రాష్ట్రానికి, పేదలకు, నిర్వాసితులకు, అందుబాటులోకి కాకుండా, కేవలం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఇచ్చిందని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ విమర్శించారు. బుధవారం ఆయన కావలి సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి అమరావతి నిర్మాణానికి రూ.15వేల కోట్లు ఇస్తామన్నారు. కానీ అదికూడా అప్పు తప్ప, గ్రాంటు కాదన్నారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు నిధులు అనేక సంస్థల నుండి ఇస్తామన్నారు. కానీ బడ్జెట్లో నిధులు కేటాయించలేదన్నారు. పునరావాస కేంద్రాలలో ఉన్న గ్రామాలలో యువకులకు లెక్క కట్టి, అమౌంట్ ఇచ్చి, ఇతర ప్రాంతాలకు వెళ్లే వారికీ పునరావాసం కల్పించే ప్రయత్నం చేయలేదన్నారు. అదానీ, అంబానీలకి అనేక పోర్టులు అప్పజెప్పారన్నారు. బడ్జెట్ చూస్తే కార్పొరేట్ శక్తులకు ఉపయోగ పడే విధంగా ఉందన్నారు. ఉపాధి హామీ పథకానికి కేవలం రూ.86 వేలకోట్లు మాత్రమే కేటాయించారన్నారు. బడ్జెట్లో ప్రత్యేక హోదా ఊసే ఇవ్వలేదని, ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వలేదన్నారు, పైగా హామీ కూడా ఇవ్వలేదన్నారు. రైతులకు స్థిరమైన అమౌంట్ కేటాయించి, వారికే పెట్టుబడి అందించడంలేదన్నారు. విద్య, వైద్యానికి నిధులు కేటాయించలేదన్నారు. విశాఖ ఉక్కును ప్రయివేటీకరణ కాకుండా నిలుపుతామని బిజెపిగానీ, టిడిపి, జనసేన పార్టీలు గానీ చెప్పలేదన్నారు. పేదలపై 30శాతం భారాలు వేసే ప్రయత్నం చేశారన్నారు. కృష్ణపట్నం, రామాయపట్నం పోర్టుల నిర్వాసితుల భూములకు పరిహారం ఇంకా చెల్లించలేదన్నారు. ఈ విషయాలన్నింటిపై సిపిఎం రాబోవు కాలంలో ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తుందని తెలిపారు. వ్యవసాయ కార్మికులకు జీవనాధారమైన ఉపాధి హామీ చట్టంలో 200 రోజులు పని దినాలు కల్పించాలని రూ.600 కనీసవేతనం ఇవ్వాలన్నారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య, అధ్యక్షులు జొన్నలగడ్డ వెంకమ రాజు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తుళ్లూరు గోపాల్, వ్యకాస రాష్ట్ర కమిటీ సభ్యులు తాళ్లూరు మాల్యాద్రి, దేవ కుమార్, బెల్లంకొండ నాగమ్మ, సిఐటియు నాయకులు పసుపులేటి పెంచలయ్య, వ్యకాసం జిల్లా నాయకులు బట్ట పెద్దబ్బయ్య, మోడేగుంట రామచంద్రయ్య, నక్క రాధయ్య, కాంతారావు, రాధాకృష్ణయ్య, ఆంటోని, జి.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

సిపిఎం నాయకులు నరసింహంకు పరామర్శ

ప్రజాశక్తి-గుడ్లూరు

సిపిఎం సీనియర్ నాయకులు నూతలపాటి నరసింహం త్వరగా కోలుకోవాలని కందుకూరు ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు ఆకాంక్షించారు. గుడ్లూరు మండలం చేవూరులో నూతలపాటి నరసింహం ఇంటికి బుధవారం చేరుకొని ఎంఎల్ఎ పరామర్శించారు. అనారోగ్యం కారణంగా తీవ్ర అస్వస్థత గురైన నూతలపాటి నరసింహం గొప్ప ప్రజా నాయకుడని గ్రామాన్ని అభివృద్ధి చేయడంలో కృషి చేశారని కొనియాడారు. నరసింహం కుటుంబ సభ్యులతో మాట్లాడారు. నరసింహం తమ్ముడు హైకోర్టు లాయరు నూతలపాటి కృష్ణమూర్తి, నూతలపాటి వెంకటేశ్వర్లు, నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.



నరసింహం కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-ఉదయగిరి

జరుగుతున్న ప్రత్యేక పారిశుధ్యం మెరుగు కార్యక్రమంలో భాగంగా ఎంపిడిఒ డి.ఈశ్వరమ్మ ప్రత్యేక దృష్టి సారించారు. బుధవారం మండల పరిధిలోని జరుగుతున్న ప్రత్యేక పారిశుధ్య పనులను ఇఒపిఆర్‌డి ఎస్.మల్లికార్జునతో కలిసి ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అందులో భాగంగా జిఅయ్యవారిపల్లిలో దుకాణాల వద్ద పరిశుభ్రత పాటించాలని నోటీసులు అందజేశారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న శానిటైజేషన్ పనులను పరిశీలించారు. దేకురుపల్లిలో ట్యాంకులో జరుగుతున్న క్లోరినేషన్ పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుత సీజన్ వ్యాధులపై అప్రమత్తంగా ఉంటూ ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకుంటూ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది ఆంజనేయులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఎంపిడిఒ ఈశ్వరమ్మ



కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

కోవూరు ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారంతో టిడిపి నాయకులు దువ్వూరు కళ్యాణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పుముజుల శ్రీనివాసులు మహాలక్ష్మి జ్ఞాపకార్థం నిర్వహించే 11వ ఆంధ్ర రాష్ట్ర బీచ్ కబడ్డీ పోటీల్లో ఏర్పాట్లలో భాగంగా జిల్లా కబడ్డీ ప్లేయర్లకు ఇందుకూరుపేటలో ఎంకెఆర్ స్కూల్ ప్రాంగణంలో కబడ్డీ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కబడ్డీ పోటీల నిర్వాహకులు పుముజుల రవికుమార్ పాల్గొని పురుషులు, మహిళా క్రీడాకారులకు కిట్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 11వ రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీలకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు, క్రీడాభిమానులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని తెలిపారు. 2, 3, 4 తేదీలలో జరిగే కబడ్డీ పోటీలను ప్రతి ఒక్కరూ వచ్చి విజయవంతం చేయాలని కోరారు. కబడ్డీ పోటీల కోసం ఎంతో శ్రమిస్తూ క్రీడాకారులకు తన సాయి శక్తుల ఏర్పాట్లు కోసం కృషి చేస్తున్న దాసరి విజయ్‌కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంటరీ కార్యనిర్వహక కార్యదర్శి చెంచు కిషోర్ బాబు, నిర్వహణ కార్యదర్శి దాసరి విజయకుమార్, పవన్‌రెడ్డి, రమేష్ నాయుడు, చెంచు ఆర్‌టిసి శ్రీనివాసులు. నాగిరెడ్డి వెంకటరమణయ్య, క్రీడాభిమానులు నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ భవనం పరిశీలన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్



ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో త్వరలో ఏర్పాటు చేయనున్న అన్న క్యాంటీన్ భవనాన్ని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా బుధవారం పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15న అన్న క్యాంటీన్ ప్రారంభించేందుకు సిద్ధమవుతుందని, అందుకనుగుణంగా పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. అన్నా క్యాంటీన్ పరిసరాలను ప్రతిరోజూ పరిశుభ్రంగా ఉంచాలని, ఎటువంటి చెత్తాచెదారం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయనవెంట మున్సిపల్ ఎఇ ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

8న పాఠశాలల నిర్వహణ కమిటీలు ఎన్నిక

ప్రజాశక్తి-అనంతసాగరం

రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల నిర్వహణ కమిటీ ఎన్నిక ఆగస్టు 1 నుంచి విడుదల చేస్తూ రాష్ట్ర సమగ్ర శిక్ష సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారని బుధవారం ఎంఇఒలు జానకిరామ్, కాటంరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. 1వ తేదీన నోటిఫికేషన్ విడుదల, నోటీస్ బోర్డులో ఓటర్ లిస్ట్ ప్రదర్శన, 5న ఫిర్యాదులపై అభ్యంతరాలు స్వీకరణ, నోటీస్ బోర్డ్‌లో తుది ఓటర్లు జాబితా ప్రదర్శిస్తారని తెలిపారు. 8వ తేదీ పాఠశాల నిర్వహణ కమిటీల ఎన్నిక, ఎస్ఎంసి సభ్యులు ఎన్నిక, ఎస్ఎంసి సభ్యులతో, చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యుల ప్రమాణం, ఎస్ఎంసి తొలి సమావేశం జరుగుతుందని తెలిపారు.

జగన్‌కు 'పాలపిట్ట దీర్ఘకావ్యం' అందజేత

ప్రజాశక్తి-కందుకూరు



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని బుధవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో కలిసి తాను రచించిన పాలపిట్ట దీర్ఘకావ్యని ముప్పవరపు కిశోర్ అందించారు. మరింత ప్రజా ప్రయోజనమైన, సమాజానికి ఉపయోగపడే సాహిత్యంను నుండి రావాలి కిషోర్ అంటూ భుజం తట్టి ప్రోత్సహించి చిరునవ్వుతో చెప్పినట్లు కిశోర్ తెలిపారు.

సోమశిల డ్యామ్‌కు కృష్ణా జలాలు

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలంలోని సోమశిల ప్రాజెక్టుకు ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు పోతిరెడ్డిపాలెం హెడ్ రెగ్యులేటర్ నుంచి బనకచర్ల ప్రాజెక్టుకు ఐదు రోజులు ముందు కృష్ణా జలాలను విడుదల చేశారు. ఈ నేపథ్యంలో బనకచర్ల ప్రాజెక్టు నుంచి పదివేల క్యూసెక్కుల నీటిని ప్రాజెక్ట్ అధికారులు సోమశిల జలాశయానికి విడుదల చేశారు. కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ బుధవారం 4వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం నమోదైంది. గురువారానికి 1వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 9 టిఎంసిల నీరు ఉందని కృష్ణా జలాల రాకతో రైతుల్లో ఆనందం మొదలైంది. తాగునీరు, సాగునీరుకు ఢోకా లేదని జిల్లా రైతాంగం చర్చించుకుంటున్నారు. ముందుగానే కృష్ణా జలాలు రావడం నెల్లూరు జిల్లాకు అదృష్టమని రైతులు భావిస్తున్నారు.

రోడ్లపై యథేచ్ఛగా ఆవుల సంచారం

- రెచ్చిపోతున్న గ్రామ సింహాలు
- భయాందోళనలో ప్రజలు

ప్రజాశక్తి-ఉదయగిరి



పశువుల యజమానులు పట్టించుకోక పోవడంతో పట్టణంలో రోడ్లపై యథేచ్ఛగా పశువులు తిరుగుతుండడంతో వాహనదారులు ప్రయాణికులు దుకాణదారులు ఇబ్బందులు పడుతున్నారు. దాంతో తరచూ ట్రాఫిక్ కూడా అంతరాయం ఏర్పడుతోంది. గోవుల యజమానులు వాటిని పట్టించుకోకుండా రోడ్లపై వదిలి వేయడంతో ఈ దుస్థితి ఎదురవుతుందని పట్టణ ప్రజలు దుకాణ యాజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కొన్ని గోవులు పలువురిని వెంటాడి పొడిచిన సంఘటనలు ఉన్నాయి. దానితోపాటు ఎక్కడపడితే అక్కడ గ్రామసింహాలు ఎక్కువ గుంపులు గుంపులుగా చేరి చిన్నారులను విద్యార్థులను భయాందోళనకు గురి చేస్తున్నాయని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామ సింహాలు బెడదకు చిన్నారులను స్కూలకు పంపాలన ఎప్పుడు ఏం జరుగుతుందో అని అనుక్షణం భయపడుతూ స్కూలుకు పంపాల్సి వస్తుందని చిన్నారుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా మండల పంచాయతీ పాలకవర్గం చర్యలు తీసుకోవాలని అనేకమార్లు చెప్పిన ఫలితం లేదని వీటి నివారణ చేయుటకు జిల్లా ఉన్నతాధికారులు చొరవ తీసుకొని అనుక్షణం ఏమి జరుగుతుందో అని భయాందోళన చెందుతున్న పట్టణ ప్రజలకు విముక్తి కలిగించాలని కోరుతున్నారు.



మాధవిలత దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రిటైర్డ్ టీచర్‌కు సన్మానం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

పట్టణంలోని వెస్ట్ ఎంపిపి పాఠశాలలో యల్లావుల మాధవిలత (ఎస్‌జిటి) బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీతాదేవి, ఉపాధ్యాయుని ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో మాధవిలత దంపతులను ఘనంగా శాలువాలతో సన్మానించారు. అనంతరం కుటుంబ సభ్యులు కుమారుడు తోడేటి రాజేష్, కుమార్ కోడలు ప్రశాంతి మనమల్లు మనవరాలు, బంధువులు పాల్గొని ఘనంగా సన్మానించారు. గత 40యేళ్లగా విద్యాభివృద్ధిలో ఆమె చేసిన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 చలపతి, ఉపాధ్యాయులు సుధాకర్ రెడ్డి, గంగాధర్, మంజులవాణి, శశికళ ధనమ్మ, వెస్ట్ కాంప్లెక్స్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఫయాజుద్దీన్, ఈశ్వర్ రెడ్డి, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.



ప్రగతి ఛారిటీస్‌లో అన్నదానం

ప్రజాశక్తి-నెల్లూరు : మాదరాజు గూడూర్ యూత్ ఆధ్వర్యంలో పెనుబల్లి పిచ్చిరెడ్డి కుమారుడు పెనుబల్లి శేషురెడ్డి జన్మదినం సందర్భంగా ప్రగతి ఛారిటీస్‌లో బుధవారం అన్నదానం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పెనుబల్లి శేషురెడ్డి సతీమణి సునంద రెడ్డి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ పెనుబల్లి పిచ్చిరెడ్డి ఆశయాల కొనసాగిస్తామన్నారు. కార్యక్రమం నిర్వాహకులు రాము, న్యాయవాది పచ్చా కిరణ్ మాట్లాడుతూ గతంలో ఎన్నో సేవా కార్యక్రమాలకు శేషురెడ్డి సహకారం అందించారని తెలిపారు. వారికి, వారి కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు. కరోనాలోనూ పలు సేవా కార్యక్రమాలకు అండగా నిలబడ్డారని కొనియాడారు. వారిచ్చిన స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అశోక్, గణేష్, సిసింద్రీ, దినేష్, దినేష్, అఖిల్, విజయ్, సాయి, ప్రశాంత్, శ్రీకాంత్, అజయ్, కిషోర్, రాజేష్ తదితరులున్నారు.

శిథిలావస్థలోని పాఠశాల భవనం మార్పు

ప్రజాశక్తి-ఉదయగిరి

శిథిలావస్థలో ఉన్న ఎంపిపిఎస్ గండిపాలెం మెయిన్ పాఠశాలను మండల విద్యాశాఖ అధికారులు షేక్ మస్తాన్ వలీ, తోట శ్రీనివాసులు మార్పు చేశారు. బుధవారం మండల పరిధిలోని గండిపాలెం ఎంపిపిఎస్ గండిపాలెం మెయిన్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు గ్రామస్తులు తల్లిదండ్రులు దాతలతో సమావేశం ఏర్పాటు చేసి ఈ పాఠశాల గురించి డీఈవో దష్టికి తీసుకువెళ్లామని ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం విద్యార్థుల భద్రత దృష్ట్యా పాఠశాల శిథిలావస్థలో ఉన్నందున అద్దె భవనంలోకి మార్చడానికి తల్లిదండ్రుల గ్రామస్తులు దాతల సహకారంతో గ్రామంలో రెండు మూడు అద్దె భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ ఎస్ఎంసి తీర్మానం రాసి పాఠశాలను అద్దె భవనంలోకి మారుస్తామని చెప్పడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్‌జి షాహిదాఅక్తర్, ఉపాధ్యాయినులు ఎస్.కె.ఎన్ నసీం, షేక్ హసీనా, ఎస్ఎంసి చైర్మన్ రాజా, గ్రామస్తులు నరసింహారావు, అంకయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఇఒలు మస్తాన్‌వలీ, శ్రీనివాసులు

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

ప్రజాశక్తి-గుడ్లూరు

మండలంలోని చేవూరు వద్ద శ్రీ రామదూత స్వామి అనాథ పిల్లల ఆశ్రమ పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్, ఆడియో విజువల్ క్లాసులను బుధవారం కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. వేదపారాయణం చేస్తూ ఆత్మీయంగా స్వాగతం పలికిన విద్యార్థులు, ఆశ్రమ నిర్వాహకులు.. తర్వాత దత్తాత్రేయ స్వామి ఆలయంలో ఎంఎల్ఎ పూజలు చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమాల అనంతరం పాఠశాలలోని 154 మంది విద్యార్థులకు ఎంఎల్ఎ నాగేశ్వరరావు దుప్పట్లు పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆశ్రమ ఇన్‌ఛార్జి హనుమంతరావు చౌదరి, కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, కరస్పాండెంట్ డాక్టర్ ఎం.వి చలపతిరావు, ఆశ్రమ కమిటీ సభ్యులు డాక్టర్ చంద్రకుమార్, టిడిపి నాయకులు, మాజీ ఎంపిపి పొట్టేళ్ల మురళి తదితరులు పాల్గొన్నారు.




ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ నాగేశ్వరరావు

వాకర్స్ అసోసియేషన్‌కు విరాళం

ప్రజాశక్తి-బిట్రగుంట

బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 4న బోగోలు అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి కప్పరాల తిప్ప సెంటర్ ఏకలవ్య విగ్రహం వరకు నిర్వహిస్తున్న 3కె రన్ కార్యక్రమానికి దాత కాంట్రా సతీష్ నాయుడు రూ.5వేల చెక్కును వారి తమ్ముడు కాంట్రా మల్లికార్జున నాయుడు బిట్రగుంట వాకర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు నూకసాని శ్రీనివాసులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు నూకసాని శ్రీనివాసులు మాట్లాడుతూ అసోసియేషన్‌కు దాత సతీష్ నాయుడుకు విరాళం అందజేయడం ఎంతో ఆనందంగా ఉందని, బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ కమిటీ తరపున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు జిలాని, శంకర్‌నాయుడు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.





మంత్రిని కలిసిన రవిచంద్ర

ప్రజాశక్తి-బిట్రగుంట

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామిని బుధవారం శ్రీ విఘ్నేశ్వర రామలింగేశ్వర స్వామి ఆలయ వ్యవస్థాపకులు బత్తుల రవిచంద్ర మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ బోగోలు మండలం విశ్వనాథరావు పంచాయతీ రామస్వామిపాలెం గ్రామంలో ఉన్న శ్రీ విఘ్నేశ్వర రామలింగేశ్వర స్వామి ఆలయం ధ్వజస్తంభం, నవగ్రహాలు శంకుస్థాపన ప్రత్యేక పూజ కార్యక్రమాలు ఆగస్టు 30న నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామిని వారి ఇంటికి వెళ్లి మర్యాదపూర్వకంగా ఆహ్వానించామని, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో మండలం రామస్వామి పాలెం అంబేద్కర్ యూత్ సభ్యులు సుధా, ఆలయ కమిటీ మహిళ సభ్యురాలు తదితరులు పాల్గొన్నారు.



జగన్‌ను కలిసిన 'బుర్రా'

ప్రజాశక్తి-కందుకూరు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మాజీ శాసనసభ్యులు కందుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ తాడేపల్లి క్యాంపు ఆఫీసులో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కందుకూరు పార్టీ విషయాల గురించి చర్చించారు.

నేడు పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-ఉదయగిరి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక చేపట్టిన పెన్షన్ కార్యక్రమానికి అన్ని రకాల పెన్షన్ దారులు అందుబాటులో ఉండి పెన్షన్ నగదును అందుకోవాలని ఎంపిడిఒ ఈశ్వరమ్మ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉదయం 6 గంటల నుండి గడపగడపకు పెన్షన్ పంపిణీ కార్యక్రమం ప్రారంభం అవుతుందని రెండు రోజులు మాత్రమే ఈ పెన్షన్ పంపిణీ సచివాలయ సిబ్బంది అందజేస్తారన్నారు. ఒకటి రెండు తేదీలో మాత్రమే పెన్షన్ ఈ పంపిణీ జరుగుతుందని ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన మరి కొన్ని సమస్యలతో ఉన్న ప్రతి పెన్షన్‌దారులు ఎక్కడ ఉన్నా ఒకటవ తేదీ పెన్షన్ తీసుకునేందుకు తమ గ్రామంలోని ఇండ్లల్లో అందుబాటులో ఉంటూ పెన్షన్ అందుకోవాలని కోరారు.

ప్రజాశక్తి-వరికుంటపాడు : ఆగస్టు 1వ తేదీన పెన్షన్ పంపిణీ కార్యక్రమం ఉదయం 6గంటల నుండి సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకే ప్రతిఒక్కరికీ అందజేస్తారని ఎంపిడిఒ తోట వెంకటక్రిష్ణకుమారి తెలిపారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో పెన్షన్ లబ్ధిదారులు అందరూ 1న ఎక్కడికి వెళ్లకుండా అందరూ ఇళ్ల వద్దనే ఉండాల్సిందిగా కోరుతున్నామన్నారు. 100కు 90శాతం పెన్షన్లు 1వ తేదీన పంచబడునని రెండో తేదీన ఎవరైనా ఆసుపత్రికి వెళ్లిన వెళ్లి ముద్రలు పడకపోయినా వారికీ మాత్రమే ఇస్తామన్నారు. పెన్షన్ లబ్ధిదారులు సాధ్యమైనంత వరకు 1వ తేదీన అందరూ ఇంటి వద్దనే ఉండాలని కోరారు. 3న సైట్ క్లోజ్ అవుతుందని, 1, 2 తేదీల్లోనే పెన్షన్ పొందాలని ఎంపిడిఒ తెలియజేశారు.

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లను గురువారం పంపిణీ చేయనున్నట్లు ఎంపిడిఒ మనోహర్ రాజు తెలియజేశారు. మండలంలో 6250 మంది పింఛన్ లబ్ధిదారులకు 2కోట్ల 63లక్షల 73వేలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. పెన్షన్లను గ్రామపంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది ఉదయం 6 గంటలకు ప్రారంభించి లబ్ధిదారులకు ఇంటివద్దనే నగదును అందజేయాలన్నారు. మొదటిరోజు 99శాతం పెన్షన్లు పంపిణీ చేయాలని సూచించారు. మిగిలిన పెన్షన్లను రెండోరోజు పూర్తి చేయాలన్నారు. పెన్షన్ నగదును పంచాయతీ కార్యదర్శులు వెల్ఫేర్ అసిస్టెంట్లు బ్యాంకు నుండి తీసుకుని వచ్చి సచివాలయ సిబ్బందికి సక్రమంగా అందేలా బాధ్యత తీసుకోవాలన్నారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో ఉదయం 6గంటలు నుండి ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేయనున్నట్లు ఎంపిడిఒ తాజ్‌మస్రూర్ తెలిపారు. లబ్ధిదారులు గ్రామ సచివాలయాన్ని గానీ బ్యాంకుల వద్దకు గాని వెళ్లవలసిన అవసరం లేదన్నారు. దూర ప్రాంతంలో ఉన్న పింఛన్‌దారులు గ్రామానికి వచ్చి తీసుకోవాలని కోరారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని 2వ తేదీకి పూర్తి చేయనున్నట్లు ఆయన తెలియజేశారు.

ప్రజాశక్తి-కందుకూరు : ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు నియోజకవర్గంలోని అన్ని మండలలాలో పాల్గొంటారని కందుకూరు టిడిపి కార్యాలయం ప్రకటనలో తెలిపింది. గురువారం ఉదయం 7 గంటలకు కందుకూరు పట్టణంలోని 9వ వార్డు ఆదిఆంధ్ర కాలనీలో ఉదయం 9.30 గంటలకు లింగసముద్రం పంచాయతీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం ప్రాంతంలో, ఉదయం 11 గంటలకు వలేటివారిపాలెం మండలం పోకూరు ఎస్‌సి కాలనీలో జరిగే పింఛన్ల పంపిణీలో పాల్గొంటారని తెలిపారు. కావున తెలుగుదేశం, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు హాజరు కావాల్సిందిగా కోరారు.



పలుచోట్ల అన్నదానం

ప్రజాశక్తి-కావలి

నెల్లూరు పట్టణం నివాసులు కె.రాములు 30వ వర్ధంతి సందర్భంగా వారి కుమారులు, కోడళ్లు నెల్లూరులో నివాసం ఉంటున్న కె.శ్రీనివాసరావు - ఎన్‌సి లలిత దంపతులు, డిల్లీలో నివాసం ఉంటున్న కె.కనకారావు - విజయలక్ష్మి దంపతులు బుధవారం పెంకుల ఫ్యాక్టరీ, చెరువు కట్ట గిరిజనులకు సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ఆధ్వర్యంలో బుధవారం పేదలకు నూతన వస్త్రాలు ఇచ్చి, అన్నదానం చేశారు. కార్యక్రమంలో దాతలు కె.శ్రీనివాసరావు - ఎన్‌సి లలిత దంపతులు, దాత కుటుంబ సభ్యులు స్టెల్లా, సంయుక్త సేవాసంస్థ సభ్యులు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ నేటిదాతలు శ్రీనివాసరావు, కనకారావు, సంయుక్త సేవాసంస్థ ద్వారా గత కొన్ని సంవత్సరాలుగా సేవలు కొన సాగిస్తూ ఉండటం గొప్ప విషయమన్నారు.



మాట్లాడుతున్న ఎపిడి బాబురావు

ఇన్‌ఛార్జి ఎపిడి సమీక్ష సమావేశం

ప్రజాశక్తి-కందుకూరు

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై కందుకూరు మండల కార్యాలయంలో ఇన్‌ఛార్జి ఎపిడి బాబురావు సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల లో కూలీల సంఖ్యను పెంచాలన్నారు. నాలుగు గంటలు సేపు కూలీలు పని చేయాలని పేర్కొన్నారు. పని కావాలని అడిగిన కూలీలకు పని ఉండే విధంగా సిబ్బంది చూసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఎపిఒ ఎల్ వి సుజాత, టి ఎ, సి ఒ, పేతురు సహాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే సంపద సృష్టి

ప్రజాశక్తి-ఉదయగిరి

భారతదేశంలోనే విజనరీ కలిగిన, సంపదను సృష్టించే సామర్థ్యం కలిగిన ఏకైక ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని నెల్లూరు జిల్లా మాజీ జెడ్‌పి చైర్మన్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వక కార్యదర్శి చెంచలబాబు యాదవ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక చెంచు రామయ్య నగర్‌లోని స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి అధికారంలోకి వచ్చిన రెండు నెలల కాలంలోనే ఇచ్చిన హామీలు తూచా తప్పకుండా అమలు చేసి చూపించిన డైనమిక్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ఖజానాను దివాలా తీయించారని పిచ్చిపిచ్చి పనులతో రాష్ట్రం పూర్తిగా వెనుకబడేలా చేసారని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో పేదవాళ్లకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తే వాగుల్లో వంకల్లో కొండల్లో కోనల్లో ఊరికి దూరంగా ఇద్దరు మనుషులు కూడా ఉండేందుకు సరిపడని విధంగా జగన్మోహన్ రెడ్డి కేటాయించారని ఇంటి నిర్మాణానికి కేవలం లక్ష ఇరవై వేల రూపాయలు మాత్రమే కేటాయించారని తెలిపారు. అధికారంలోకి రాగానే కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి కూటమి ప్రభుత్వంలో ఉన్న సన్నిహిత సంబంధాల వల్ల రాష్ట్రానికి మంజూరు చేయించుకున్నారని రాష్ట్ర రాజధానికి ప్రత్యేకంగా రూ.15వేల కోట్లు తీసుకొచ్చిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ అసెంబ్లీలో మొదటి రోజు తన మొదటి అవకాశంలోనే ఉదయగిరి నియోజకవర్గ చిత్రపటాన్ని కళ్ళకు కట్టినట్టు ఆవిష్కరించారని ఉదయగిరి, వింజమూరు ప్రాంతాల్లో డయాలసిస్ సెంటర్ల ఏర్పాటుతో పాటు రహదారి సౌకర్యాలు, తాగు, సాగునీటి అవసరాలు వలసల నిర్మూలనకు ఉపాధి అవకాశాలు కావాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు చింతనబోయిన బయన్న, మాజీ కన్వీనర్ బొజ్జ నరసింహులు, లీగల్ సెల్ అడ్వైజర్ సంధిరెడ్డి రామారావు, నల్లిపోగు రాజా, జల్సా యాదవ్, అంబటి మస్తాన్, ఉడతా సుమన్, రామ్మోహన్ ఖాన్సా, మాబాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చెంచలబాబు యాదవ్